## వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

-మాజీ జెడ్‌పిటిసి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

**అమడగూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో సోమవారం మాజీ జెడ్‌పిటిసి, హిందూపురం పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండల వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో జిఒ నెంబర్ 59 ప్రకారం అమడగూరు మండలానికి 14.85 లక్షలు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంత్రిగా వున్న సమయంలో అప్పటి మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మంజూరు చేసి ప్రతి గ్రామానికి తారురోడ్లు రావడం జరిగిందన్నారు. నాలుగేళ్ల ఆలస్యం చేసుకుని తెలుగుదేశం పార్టీ చేసినవన్నీ మా పార్టీ చేసిందని గొప్పలు చెప్పుకుంటూ పోతున్నారని ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో వున్నా గ్రామాల్లో నీటి కొళాయిలు, పైపులు అమర్చడం చేతగాని మీరు తెలుగుదేశం ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత లేదని రెడ్డివారిపల్లి గ్రామస్తులు కీర్తిశేషులు డాక్టర్ రమణ ప్రోత్సాహంతో 60 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని అభివృద్ధి అంటే ఏమిటో వారిని అడిగితే తెలుస్తుందని అమడగూరు అభివృద్ధి అంటే పల్లె పల్లె అంటే అమడగూరు తెలుగుదేశంపార్టీ అని గ్రామంలో ఎవరిని అడిగినా చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో పుట్టపర్తి నియోజకవర్గం ట్రేడింగ్ కమిటీ సెక్రటరీ అంగడి అమర, మాజీ ఎంపిపి రామచంద్ర, రమేష్, నారాయణరెడ్డి, మధురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న నువ్వే మా భవిష్యత్తుకు స్పందన



జగనన్న నువ్వే మా భవిష్యత్తు స్టికర్లు అతికిస్తున్న సర్పంచ్ పంచరత్నమ్మ

**నల్లచెరువు, ఏప్రెల్ 17, ప్రభాతవార్త**

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని విజయలక్ష్మీ కాలనీ నందు 9వ వార్డులో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ పంచరత్నమ్మ, గృహసారథులు కుళ్ళాయప్ప, చంద్రకళ, వాలంటీర్‌లు సాయి పల్లవి, వైసిపి నాయకులు, కార్యకర్తలు జగనన్నే మా భవిష్యత్తు కార్యమ్రం నిర్వహించడం జరిగింది. ఈ సంధ్బంగా విజయలక్ష్మీ కాలనీ 9వ వార్డులోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ జగనన్న నువ్వే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించారు. సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ తీరుపై అభిప్రాయాలను స్వీకరించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన నవరత్నాలు కొనసాగాలంటే మళ్ళీ మన జగనన్నని ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్నకు అండగా ఉంటామని ప్రజలు తెలిపారు.

## శ్రీధర్మశాస్త అయ్యప్ప ఆలయానికి విద్యాగణపతి విగ్రహం వితరణ

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

మండలంలోని యం కొత్తపల్లి బండపై వెలసిన శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయానికి మండల కేంద్రానికి చెందిన ఆర్ఆర్ బ్యాంగిల్ స్ అండ్ బుక్‌సెంటర్ యజమాని రాము విద్యాగణపతి విగ్రహాని వితరణగా అందచేశారు. సోమవారం అయ్యప్ప స్వామి ఆలయం లో విద్యాగణపతి (వీణా వినాయకస్వామి) రాతి శిలా ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడుకు అందచేశారు. మాజీ సింగిల్ విండో అంధ్యక్షులు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, వైద్యశాఖ విశ్రాంత ఉద్యోగి పుల్లప్ప, నాగేశ్వరయ్యశెట్టి, మాజీ కో అప్ష్న్ సభ్యులు టైలర్ నిజాంలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా విగ్రహ ప్రతిష్ట పోస్టర్లు విడుదల చేశారు.



విద్యాగణపతికి పూజలు

## గుండెపోటుతో కడపల గోపాల్‌రెడ్డి మృతి

**అమడగూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని కొటావ్రారిపల్లి పంచాయతీ ఎర్రగొండవారిపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కడపల గోపాల్‌రెడ్డి (76) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో వైసిపి సిఇఒ సభ్యులు డాక్టర్ కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢసానుభూతి తెలిపారు. ఈ కార్య క్రమంలో యువనాయకులు కొత్తకోట చక్రధరరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘువీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు.

## సచివాలయ హెల్త్‌స్టాఫ్‌ల సమావేశం

**నంబులపూలకుంట, ఏప్రెల్ 17, ప్రభాతవార్త:**

మండలంలోని 10 సచివాలయాల హెల్త్ స్టాఫ్ వారికి సోమవారం డాక్టర్ ఆసియా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పిహెచ్‌సి నందు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో గర్భవతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రక్తహీనతతో ఇబ్బంది పడుతున్న గర్భవతులను గుర్తించి సరైన సమయంలో సరైన చికిత్స అందించాలని తెలియజేశారు. ఎన్‌సిడిసిడి విషయంలో తక్కువ నుండి ఎక్కువ శాతం అభివృద్ధి చేయాలని చెప్పడం జరిగింది. ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్స్ మరియు అవసరమైన మందులు గ్రామంలో అందుబాటులో ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి షేక్ ఆసియా, ఆరోగ్య విస్తరణ అధికారులు లక్ష్మీనారాయణ, రాఘువేంద్ర, పిహెచ్‌యన్ శాంతమ్మ, గురుదేవి, ఫార్మసిస్ట్ వరప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ విజయభాస్కర్, రమేష్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆసుపత్రి అధికారులతో సమావేశం నిర్వహించిన ఎంపి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రంగయ్య

**అనంతపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ.. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అవసరమైన గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌ని, వైద్యులకు సూచించిన అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య సూచించారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు విరాళం ఇచ్చిన గోనుగుంట్ల



విరాళం అందజేస్తున్న గోనుగుంట్ల సూర్యనారాయణ

**అనంతపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త బ్యూరో**

రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ధర్మవరమాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ 50వేల రూపాయలు విరాళాన్ని అందించారు. అంబేద్కర్ అందరివాడు ఉత్సవ కమిటీకి సంబంధించిన నాయకులు ఆదివారం గోనుగుంట్ల సూర్యనారాయణను కలిశారు. వారు చేసిన విజ్ఞప్తికి పూర్తి సానుకూలంగా స్పందించిన గోనుగుంట్ల ఆ నాయకులకు నగదు రూపంలో విరాళాన్ని అందించారు. గోనుగుంట్ల సూర్యనారాయణ అందించిన సహాయ సహకారాలకు అంబేద్కర్ అందరివాడు ఉత్సవ కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. తన నియోజకవర్గ పరిధి కాకపోయినా వారు చేపట్టిన కార్యక్రమానికి గోనుగుంట్ల ఆ విరాళాన్ని అందించడం ముదావహం.

## ఉమాపతికి ఘన నివాళులు



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

ప్రమాదంకు గురై అకాల మరణంపొందిన శ్రీవిద్యానికేతన్ కరస్పాండెంట్ ఉమాపతికి స్థానిక అప్పుషా ఆఫీసులో జిల్లా అధ్యక్షులుపుల్లారెడ్డి ఆధ్వర యంలో నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ ఇక్బాల్, గౌరవాధ్యక్షులు నాయుడు, రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ రామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, రాష్ట్ర ఈసి మెంబర్, శశిభూషణ్, రాష్ట్ర కన్వీనర్ ఎం.నాగరాజు, మాంటిస్సోరి 8 సూర్యనారాయణరెడ్డి, లక్ష్మిస్కూల్, మధుసూధన్‌రెడ్డి, ఎటిపి డివిజన్ సెక్షన్ రవిశంకర్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ ఉద్యోగిని వేధిస్తున్న రిటైర్డ్ డీవైఈవో...!

- 2016లో రూ. 6లక్షల అప్పుకు చెక్ బుక్కులు తీసుకున్న వైనం
- మూడు నెలల క్రితమే అప్పు మొత్తం తీర్చిన ఉద్యోగి
- అయినా చెక్ బుక్కులు, ప్రాంసరీ నోటు ఇవ్వకుండా వేధింపులు
- దిక్కుతోచని స్థితిలో విద్యాశాఖ ఉద్యోగి ఏర్రిస్వామి

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**



కెఎస్ఆర్ హైస్కూల్లో దిగులుగా కూర్చున్న బాధిత ఉద్యోగి ఏర్రిస్వామి

ఓ రిటైర్డ్ డిప్యూటీ డీఈవో జిల్లా విద్యాశాఖ ఉద్యోగిని వేధింపులకు గురి చేస్తున్నారు. చేసిన అప్పుకి తనతో ఇంట్లోని పనులు చేయించుకుంటూ... అప్పు మొత్తం తీర్చినప్పటికీ చెక్కు బుక్కులు, ప్రాంసరీ నోట్ ఇవ్వకుండా గత మూడు నెలలుగా తన చుట్టు తిప్పుకుంటుండటం గమనార్హం.

అనంతపురం జిల్లా విద్యాశాఖలోని గుత్తి డిప్యూటీ డీఈవో ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగి ఏర్రిస్వామి 2012లో ప్రస్తుతం గుత్తి డివైఈవోగా రిటైర్డ్ అయిన అధికారితో తన అవసరానికి పలు మార్లు వడ్డీకి అప్పు చేయడం జరిగింది. అలా చేసిన అప్పు రూ.6 లక్షలు అయింది. అప్పు తీసుకున్నప్పుడు ఆ డీవైఈవో ఆ ఉద్యోగి చెక్కు బుక్కులను తీసుకున్నారు. పైగా ప్రాంసరీ నోటు కూడా రాయించుకున్నారు. అప్పటి నుంచి ఆ ఉద్యోగితో ఆ రిటైర్డ్ డివైఈవో తన ఇంట్లోని పనులు చేయించుకుంటుండేవారు. ఆ ఉద్యోగి తన అప్పు మొత్తాన్ని కూడా వడ్డీతో సహా మూడు నెలల క్రితమే చెల్లించారు. అప్పు చెల్లించినప్పుడు తన చెక్కు బుక్కులు, ప్రాంసరీ నోటు ఇవ్వాలని ఆ ఉద్యోగి గత మూడు నెలల నుంచి అడుగుతూనే వున్నాయి. అయినా కూడా ఆ రిటైర్డ్ డివైఈవో ఏమాత్రం స్పందించకుండా అదిగో ఇదిగో అంటూ తన ఇంటి చుట్టు తిప్పుకుంటున్నట్లు తెలిసింది. దీంతో ఆ ఉద్యోగి చేసేదేమి లేక ఆదివారం తనకు తెలిసిన వారిని ఆ రిటైర్డ్ అధికారి వద్దకు పిలుచుకెళ్ళి చెక్కు బుక్కులు, ప్రాంసరీ నోటు ఇవ్వాలని అడిగించారు. అలా వారి మధ్య గొడవ కూడా జరిగింది. అయినా ఆయన కూడా చెక్కు బుక్కులు, ప్రాంసరీ నోటు ఇవ్వకపోవడం గమనార్హం. ఆ ఉద్యోగి కుటుంబ పరిస్థితి చాలా ఆధ్వాన్నంగా వుంది. వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించాలి. చేసిన అప్పులకు కట్టింగులు పోయి చేతికి దాదాపు రూ.10 వేలు మాత్రమే వస్తుంది. ఆ డబ్బుతోనే కుటుంబాన్ని పోషిస్తున్నారు. తన క్రింద స్థాయి ఉద్యోగికి సహాయంగా, అండగా ఉండాల్సిన ఆ రిటైర్డ్ డివైఈవో అప్పు తీరినప్పటికీ తీసుకున్న చెక్క్ బుక్కులు, ప్రాంసరీ నోటు వెనక్కి ఇవ్వకపోవడాన్ని విద్యాశాఖలోని పలువురు ఉద్యోగులు తప్పుబడుతున్నారు. ఎలాంటి సహకారం లేని ఆ ఉద్యోగికి ఆ రిటైర్డ్ డివైఈవో నుంచి చెక్కు బుక్కులు, ప్రాంసరీ నోటు ఇప్పించేలా విద్యాశాఖ, పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

## బుధవారం రోజు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం

**అనంతపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

అనంతపురం నగర పాలక సంస్థ ద్వారా నగర ప్రజలకు సరఫరా చేసే త్రాగునీరు మెయిన్ పంపింగ్ లైన్ జల్లిపల్లి టోల్‌గేట్, కూడేరు వద్ద లీకేజ్ కారణంగా మరమ్మత్తులు చేపట్టనున్నారు. ఈ కారణంగా బుధవారం సాయంత్రం అందించే కాలనీలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నది. కావున నగర ప్రజలు గమనించి సహకరించాలని తెలియజేశారు.

## కొనసాగుతున్న జగనన్నే మా నమ్మకం



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**యాడికి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్మాజిపేట, రామరాజుపల్లి గ్రామాల్లో సోమవారం ఉపసర్పంచు ప్రవీణ్, తలారి నాగేష్‌ల ఆధ్వర్యంలో జగనన్నే మా నమ్మకం, మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం కొనసాగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాల్లో భాగంగా ప్రతి కుటుంబం లబ్ది పొందినది, లబ్దిదారులతో పథకాల అమలు తీరును తెలుసుకుంటూ ప్రభుత్వ విధానాల గురించి ఆరా తీస్తూ పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టుకుంటూ ఆద్యంతం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపరిస్కృతంగా వున్న సమస్యలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సహకారంతో పరిష్కరించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, ప్రతి కుటుంబం సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందుతోందని తలారి నాగేష్ పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో డీలర్లు మల్లికార్జున, రషీదు, వాలంటీర్ రాకేష్, లబ్దిదారులు పాల్గొన్నారు.

## పంట రుణాలు రెన్యువల్ చేసే రైతులకు వడ్డీ మాత్రమే కట్టించుకోవాలి



వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

**పుట్లూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

పంట రుణాల రెన్యువల్ సమయం కావడంతో వడ్డీతో మాత్రమే రెన్యువల్ చేసుకోవాలని బిజెపి నాయకులు సోమవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అంద చేశారు. ఈ సందర్భం గా బిజెపి నాయకులు మాట్లాడుతూ మండలంలో చాలా మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, చిన్న, సన్నకారు రైతులు అత్యధికంగా వున్నారన్నారు. అకాల వర్షాల వల్ల వేసిన పంటలు నష్టపోవడం జరిగిందన్నారు. రైతుల క్రాప్‌లోన్ విషయంలో అసలు వడ్డీ కట్టాలంటే ఇబ్బంది పడతారని, గత సంవత్సరం రైతుల నుండి అసలు, వడ్డీ కట్టించుకున్నారని కావునా క్రాప్ లోన్ రెన్యువల్ కావడంతో రైతులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకుని పంట రుణాల రెన్యువల్ చేసే రైతులకు వడ్డీ మాత్రమే కట్టించుకోవాలని వారు బ్యాంకు మేనేజర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పుట్లూరు మండల అధ్యక్షులు కుందు శ్రీనివాసులరెడ్డి, ఓబిసి మోర్చా మండల అధ్యక్షులు రాగేని రామాంజియాదవ్, ఎస్‌సి మోర్చా మండల అధ్యక్షుడు రామ్మోహన్, మండల ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టపర్తిని టెంపుల్‌జోన్‌గా ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సాయియూత్ సభ్యులు

**పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి పట్టణంలో రాజకీయ పార్టీలకు అతీతంగా టెంపుల్ జోన్‌గా ప్రకటించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని సాయి యూత్ సభ్యులు జిల్లా కలెక్టర్ అరుణ్బబాబుకు స్పందన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. పుట్టపర్తిలో ఆయా పార్టీల నాయకులు, దాడులు చేసే సంస్కృతిని ప్రారంభించారని, అందు వల్ల పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసే విదేశీ భక్తుల ఇబ్బందులు కగడంతో పాటు పుట్టపర్తి ప్రశాంతతకు పదేపదే భంగం వాటిల్లుతున్నందున ఈ ప్రాంతాన్ని టెంపుల్ జోన్‌గా ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలా కాని పక్షంలో సాయియూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిరాహార దీక్షలు చేస్తామన్నారు.

భగవాన్ సత్యసాయి బాబా నడియాడిన పుణ్యక్షేత్రంలో ఇలాంటి దుర్ఘటనలు రాబోవు రోజుల్లో తలెత్తకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సామకోటి ఆదినారాయణ, లక్ష్మిపతి, జ్యోతి ప్రసాద్, అబ్దుల్ అబు, రత్నప్పచౌదరి, ఉట్లసోము, సాయిభక్తురాలు గీతామేడం, పుట్ల గంగాద్రి, సుబ్రమణ్యం, అమ్మినేని కేశవ నాయుడు, జయప్రకాష్, శంకర్, మోహన్ నాయుడు, కూర్మనాయకులు, ఈనాడు గంగాధర్, కె.రఘు, మల్లికార్జున, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

**పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

సహకార సంఘాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇంతియాజ్ , కో ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికృష్ణలు డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కలెక్టరేట్ ముందు ఇంతియాజ్, ఆ యూనియన్ నాయకులు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి వల్ల సహకార సంఘాలు నర్వీర్యం కానున్నాయని, ఆందోళన వ్యక్తం చేవారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 2050 ప్రాథమిక సహకార సంఘాలలో 7,500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారందరికీ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే 62 యేళ్ల వయస్సు వర్తింపజేయాలని కోరారు.పిఎసిఎస్‌లో 50% వాటాలను ప్రైవేటు కంపెనీల వ్యక్తులకు ఇస్తూ రైతుభరోసా కేంద్రాల్లో విలీనం చేస్తూ చేసిన చట్ట సవరణ రద్దు చేయాలన్నారు. జీవో 36, జీవో 90 ప్రకారం వేతనాలు, ఇతర బెన్ఫిట్స్‌లను వెంటనే అమలు చేయాలని, ధాన్యం సేకరణలో ఇబ్బందులు తొలగించాలని, సహకార సంగాలకు ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయించాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. ఈకార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా కన్వీనర్‌ప్రతాప్ రెడ్డి, నాయకులు బొజ్జప్ప, కృష్ణారెడ్డి, మహేష్ బాబు, సిఐటియు నాయకులు ఇ.ఎస్.వెంకటేష్, సిపిఎం బ్యాళ్ళ అంజి, పైపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

## మనిషి సత్ప్రవర్తనతో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

**పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు పాటించే ఉపవాస దీక్షలు మనిషిలో దుర్గుణాలను తొలగించి సత్ప్రవర్తనతో నడవడానికి ఉపకరిస్తాయని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వ్యాఖ్యానించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని శిల్పారామం నందు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో పుణ్యకార్యమని, కులమతాలకు అతీతంగా ఈ మాసం ప్రత్యేక విశిష్టతను కలిగి ఉందన్నారు. తన పరిదిలో ఉన్న మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వం మైనారిటీ వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడతూ, అందరి సృష్టి కర్త భగవంతుడు ఒక్కడేనని, రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో నమాజు ప్రార్థనలు, జకాత్, ఫిత్ర వంటి దానధర్మాలు చేస్తారన్నారు. సోదర భావం, సమానత్వం వంఇ సద్గుణాలను పెంచడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముస్లిల కొరకు 4 % రిజర్వేషన్ తీసుకువచ్చారని గుర్తు చేశారు. తద్వారా మైనారిటీలు విద్య, ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, పుట్పటర్తి మున్సిపల్‌ఛైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ నురుల్లా, డైరెక్టర్లు మౌలానా కలీం, ఆర్‌డిఓ భాగ్యరేఖ, పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతనిధులు, ముస్లిం మతపెద్దలు, ఉపవాస దీక్షకులు పాల్గొన్నారు.

## డిఇఓతో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం

**పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**



డిఇఓకు మెమోరాండం సమర్పిస్తున్న దృశ్యం


10వ తరగతి మూల్యాంకనం 19వ తేది నుండి ప్రారంభం కాబోతున్న సందర్భంగా అన్ని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంను సోమవారం నిర్వహించారు. వైఎస్ఆర్‌టిఎఫ్ యూనియన్ తరఫున జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వి.రమణారెడ్డి, జంషిద్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొని వివిద అంశాలపై డిఇఓకు మెమోరాండం సమర్పించారు. 60 సంవత్సరాలు పైబడ్డ ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, పిహెచ్‌లు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి మినహాయింపు ఇవ్వాలని, రంజాన్ మాసం సందర్భంగా ఆరోజుల్లో ఉన్నవారికి మినహాయింపు ఇవ్వాలని, కొత్తచెరువు నుండి బస్సు సౌకర్యాలు తక్కువగా ఉన్నందున సాయంత్రం 04 గంటలకు మూల్యాంకనం ముగించాలని, త్రాగునీరు, ఇతర సౌకర్యాలు సక్రమంగా కల్పించాలని వారు డిఇఓకు అందించిన వినతి మెమోరాండంలో పేర్కొన్నారు.

## శ్రీబుగ్గరామలింగేశ్వరునికి పంచామృతాభిషేకాలు

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**



శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మ వారిని అలంకరించిన దృశ్యం

పట్టణంలోని పురాతన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందు స్వామిలు పంచామృ తాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీరాజ రాజేశ్వరిదేవి అమ్మ వారికి మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఆటో కార్మికుని కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త**

పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన కంబగిరి అనే ఆటో కార్మికుడు ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. గత 25 రోజుల క్రితం అతని భార్య రామేశ్వరి కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వారి కుటుంబ పరిస్థితిని ఎన్ఆర్ఐ కిరణ్‌కుమార్, భాస్కర్‌ల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి 10 వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. అలాగే పిల్లల విద్యాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు హామి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణాధ్యక్షులు మైదుకూరు ఆంజనేయులు, పట్టణ ప్రధాన కార్యదర్శులు చెన్న రంగనాయకులు, కృష్ణమోహన్, పట్టణ ఉపాధ్యక్షులు సబ్బయ్య, పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పి ఆకస్మిక తనిఖీ

**నల్లచెరువు, ఏప్రెల్ 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పి మాధవరెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ నందు రికార్డులు పరిశీలించి నల్లచెరువు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని అదేవిధంగా పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ ఉద్యోగరీత్యా సమయపాలన పాటించాలని ఎస్సై వరలక్ష్మీకి సూచించారు.

